నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, సోమవారం 26 మే 2025 | SURYAPET

## డిగ్రీ పరీక్షల్లో 27 మంది డిబార్

రామగిరి, మే 25 : ఎంజీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరిగిన 2వ సెమిస్టర్ రెగ్యులర్, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 27 మంది విద్యార్థులు డిబార్ అయినట్లు సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన 2వ సెమిస్టర్ పరీక్షలకు 6,145మందికిగానూ 5,363మంది హాజరుకాగా 766మంది గైర్హాజరయ్యారు. వీరిలో 16 మంది డిబార్ కాగా మాల్‌లోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో తొమ్మిది మంది, దేవరకొండలోని భవిత డిగ్రీ కళాశాలలో నలుగురు, మిర్యాలగూడలోని హసిత ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు, భువనగిరి జాగృతి డిగ్రీ కళాశాలలో ఒకరు, రామన్నపేటలోని శ్రీహిందూ డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయ్యారు. మధ్యాహ్నం జరిగిన 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 2,152 మందికి 1,898 మంది హాజరుకాగా 243 మంది గైర్హాజరయ్యారు. వీరిలో 11 మంది విద్యార్థులు డిబార్ కాగా నల్లగొండ కాకతీయ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ఐదుగురు, భువనగిరి స్టాన్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో ఒకరు, కోదాడ త్రివేణి డిగ్రీ కళాశాలలో ఒకరు, మిర్యాలగూడ విజేత డిగ్రీ కళాశాలలో ఒకరు, నల్లగొండ డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఒకరు ఉన్నారు.



నందనంలో నీరా కేంద్రాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, నాయకులు పల్లె రవికుమార్ తదితరులు

# కొత్త 'సాదాబైనామాల' సంగతేంది..?

## నూతన దరఖాస్తుదారులకు నో చాన్స్

**సాదాబైనామాల క్రమబద్ధీరణ కొందరికి మోదం. మరికొందరికి ఖేదం కానుంది. క్రమబద్ధీకరణలో గందరగోళం నెలకొంది. మూడేండ్ల కింద దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే అవకాశం కల్పించనున్నారు. కొత్తగా అప్లికేషన్ పెట్టుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించడం లేదు. దీంతో అనేక మంది పలు విధాలుగా నష్టపోనున్నారు. కొత్త వారికి సైతం రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.**

– యాదాద్రి భువనగిరి, మే 25 (నమస్తే తెలంగాణ)

**మూడేండ్ల కింద అప్లై చేసుకున్న వారికే అవకాశం**

**ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో లక్షన్నర అప్లికేషన్లు**

**జూన్ 2నుంచి భూ భారతి పూర్తి స్థాయిలో అమలు**

**మళ్లీ దరఖాస్తులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తులు**



40, 50 ఏళ్ల క్రితం భూములు, ఇండ్ల స్థలాలు కొనుగోలు చేసిన సందర్భంలో తెల్ల కాగితాలు, స్టాంపు పేపర్లపై రాసుకునే వారు. ఆ కాగితం ఉంటే అది కొనుగోలు చేసి వారి ఆస్తిగానే పరిగణనలోకి వచ్చేది. దాని ఆధారంగానే వారికి పట్టా కూడా చేసేవారు. చాలా మంది ఇలా తెల్ల కాగితాలు, స్టాంపు పేపర్లపై భూములు కొనుగోలు చేశారు. కానీ అప్పట్లో పాస్ బుక్‌లు పొందలేదు. అలా కొన్న వారిలో కొందరు చనిపోవడంతో.. ఆ సమస్యలు పెండింగ్‌లో ఉండిపోయాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాదాబైనామాల పరిష్కారానికి రెండు విడుతలుగా దరఖాస్తులు స్వీకరించి కొన్నింటిని పరిష్కరించింది.

### కొత్త దరఖాస్తులు ఎలా..?

కాంగ్రెస్ ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కరించేందుకు కొత్తగా భూ భారతి ఆర్వోఆర్ చట్టం–2024 తీసుకొచ్చింది. దాంతో సాదాబైనామా సమస్య పరిష్కారం కానుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కానీ నెలలు గడుస్తున్నా ఈ విషయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో ఎదురుచూపు తప్పడం లేదు. అయితే ఇదివరకే దరఖాస్తు చేసుకున్న సాదాబైనామా దరఖాస్తుదారులను పరిష్కరిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మూడేండ్ల కిందట ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారుగా లక్షన్నర దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించగా కొన్నింటిని తిరస్కరించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 13,500 దరఖాస్తులు, నల్లగొండలో 82 వేలు, సూర్యాపేటలో 42 వేలు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే గతంలో వివిధ కారణాలతో రిజెక్ట్ చేసినవి, అప్పుడు దరఖాస్తు చేసుకోని వారు, మూడేండ్లలో కొత్తగా వచ్చిన అప్లికేషన్లకు మోక్షం కలుగడం కష్టంగానే కనిపిస్తున్నది. వీరికి కొత్తగా అవకాశం కల్పించ లేదు. రెవెన్యూ సదస్సుల్లో కొన్ని చోట్ల దరఖాస్తులు తీసుకుంటున్నప్పటికీ వాటిని పరిగణలోకి తీసుకోరని తెలుస్తున్నది.

### అనేక విధాలుగా నష్టం

కొత్త చట్టంలోని సెక్షన్, రూల్ 6 ప్రకారం సాదాబైనామాలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా –2014 జూన్ కంటే ముందు సాదాబైనామాల ద్వారా భూమి కొనుగోలు చేసి 12 ఏండ్లు స్వాధీనంలో ఉండడంతోపాటు గత ప్రభుత్వం నిర్దేశించిన గడువులో చేసుకున్న దరఖాస్తులపై ఆర్డీఓలు విచారణ జరుపుతారు. పీఓటీ, సీలింగ్ ఆయా చట్టాల ఉల్లంఘన లేదని నిర్ధారించుకున్న తర్వాత అర్హత ఉన్న రైతుల నుంచి ప్రస్తుత రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారు. హక్కుల రికార్డుల్లో నమోదు చేసి పాసు పుస్తకం జారీ చేస్తారు. కాగా సాదా బైనామాలు క్రమబద్ధీకరణ కాకపోవడంతో రైతులు అనేక విధాలుగా నష్టపోతున్నారు. రిజిస్ట్రేషన్లు కాక భూములపై హక్కులు పొందడం లేదు. పట్టా పాస్ పుస్తకాలు లేవు. ఇప్పటికీ సదరు భూములు పాత యజమానుల పేర్లే కనిపిస్తున్నాయి. రైతు భరోసా, రైతు బీమాకు అనర్హులుగా ఉంటున్నారు. బ్యాంకు రుణాలు రావడం లేదు. ధాన్యం విక్రయిస్తే వచ్చే నగదు జమ కాదు. జూన్ 2 నుంచి కొత్త చట్టం పూర్తి స్థాయిలో అమలు కానుండడంతో కొత్త దరఖాస్తులకు అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

## జూన్ 2 వరకు నీరా కేంద్రాన్ని ప్రారంభించాలి

- గీత కార్మికుల సంక్షేమాన్ని మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం
- 100శాతం పనులు పూర్తయినా ప్రారంభించకపోవడం శోచనీయం
- నీరా కేంద్రాన్ని పరిశీలించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల

భువనగిరి కలెక్టరేట్, మే 25 : గీత కార్మికుల ఆర్థిక ఎదుగుదలను కాంక్షించి, గీత వృత్తిపై ఆధారపడి జీవించే కార్మికుల సంక్షేమం కోసం మండలంలోని నందనంలో ఏర్పాటు చేసిన తాటి నీరా ఉత్పత్తుల కేంద్రాన్ని జూన్2 వరకు ప్రాంభించాలని మాజీ ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కల్లు గీత కార్మిక సంఘాల నాయకులతో కలిసి ఆదివారం మండలంలోని నందనం గ్రామ సమీపంలోని తాటి నీరా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నీరా కేంద్రం ఏర్పాటు కోసం రూ.7కోట్లతో పనులు పూర్తి చేశామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా నీరా కేంద్రాన్ని ప్రారంభించకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. ఈ ప్రాంత గీత కార్మికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగు పర్చేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాటుపడిందని గుర్తుచేశారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవించే వృత్తిదారుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా తోడ్పాటునందించిందని తెలిపారు. వృత్తిలో భాగంగా అనునిత్యం ప్రమాదం అంచున బతుకు పోరాటం చేసే గీతన్నల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బీఆర్‌ఎస్ హయాంలో సేఫ్టీ మోకులను సైతం అంజేసిందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గీత వృత్తిదారులు సగౌరవంగా ఉండేందుకు నీరా పాలసీ తీసుకొచ్చారని చెప్పారు. అత్యంత ప్రమాదకరమైన గీత వృత్తిలో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట కార్మికులు మృత్యువాతపడుతున్నారని, వారికి కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనందించడం లేదని, ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాటి నీరా ఉత్పత్తుల కేంద్రానికి గౌడ ఆణిముత్యం బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న నీరా కేఫ్‌ను ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని కుట్రలు చేస్తున్నదని, దానిని ఉపసంహరించుకోవాలని తెలిపారు. నీరాకు మన దేశంతోపాటు ఇతర దేశాల్లో సైతం మంచి డిమాండ్ ఉందని, కానీ నీరా ప్లాంట్ ప్రారంభంపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదని చెప్పారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. గీత కార్మికులకు మద్యం టెండర్లలో రిజర్వేషన్లలను పెంచాలని, గీత కార్మికుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కల్లుగీత కార్మిక పారిశ్రామిక రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు అతికం లక్ష్మీనారాయణగౌడ్, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు జనగాం పాండు, ఏవీ కిరణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి నీల ఓంప్రకాశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు జక్కా రాఘవేందర్‌రెడ్డి, ర్యాకల శ్రీనివాస్, మొగుళ్ల శ్రీనివాస్ గౌడ్, తుమ్మల వెంకట్‌రెడ్డి, పడమటి మమత, కడమంచి ప్రభాకర్, పలుసం రమేశ్‌గౌడ్, మట్ట ధనుంజయగౌడ్, ర్యాకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

## గిరిజన పోరాటాలకు సంపూర్ణ మద్దతు

**10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి : ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి**

హాలియా, మే 25 : గిరిజన హక్కుల సాధన కోసం రాష్ట్రంలో నిర్వహించే గిరిజన పోరాటాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హాలియా రెండో రోజు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, టీఆర్‌జేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రవినాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించాలని, గిరిజనుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. అంబేద్కర్ ఓవర్సీస్ పథకం కింద విదేశాల్లో చదువుకునేందుకు వెళ్లున్న గిరిజన విద్యార్థులకు రూ.25 లక్షలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అటవీ భూములకు పట్టాలు పొందిన గిరిజన రైతులకు నీటి వసతి, పెట్టుబడి సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. టీఆర్‌జేఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రవినాయక్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థల్లో గిరిజనులకు 25 శాతం ఉచితంగా సీట్లు ఇవ్వాలన్నాడు. ఈ కార్యక్రమంలో భుడియా బాబు పీఠాధిపతి భగవాన్‌నాయక్, గిరిజన విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమావత్ జవహర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ అంగోతు వెంకన్ననాయక్, ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు చంద్రుడు నాయక్, రాగ్యానాయక్,. నరేశ్‌నాయక్, శ్రీను నాయక్, సురేశ్, భాస్కర్‌నాయక్, లాలునాయక్, ప్రదీప్‌నాయక్, ముని నాయక్, లాల్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.




మోత్కూరు మున్సిపాలిటీ కార్యాలయం

## రికవరీకి నోచుకోని పన్నులు

- పది రోజులు గడిచినా జమ కాని వసూలు చేసిన సొమ్ము
- అదనపు కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

మోత్కూరు, మే 25 : మోత్కూరు మున్సిపాలిటీలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై విచారణ కరువైంది. ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేసిన పన్నులు ఇంకా ప్రభుత్వ ఖజానాలో జమకు నోచుకోలేదు. మున్సిపల్ బిల్ కలెక్టర్లు ప్రజల నుంచి వసూలు చేసిన రూ.20 లక్షలను సొంతానికి వాడుకున్న అవినీతిపై ఈ నెల 13తేదీన నమస్తే తెలంగాణలో వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. సిబ్బంది వాడుకున్న పన్నులను15వ తేదీ వరకు ప్రభుత్వ ఖజానాకు జమ చేయించాలని మున్సిపల్ కమిషనర్ కె.సతీశ్‌కుమార్‌ను మున్సిపల్ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. పదిరోజులు గడిచినా వసూలు చేసిన పన్నుల సొమ్ము రికవరీకి నోచుకోకపోవడం గమనార్హం. మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు విధులను నిర్వహిస్తున్నారు. ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న ఎనిమిది మంది సిబ్బంది బిల్ కలెక్టర్ల బాధ్యతలు చేపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పర్యవేక్షణలోనే ఔట్ సోర్సింగ్ సిబ్బంది పని చేయాల్సి ఉంది. ప్రత్యేకాధికారుల పాలనలో పర్యవేక్షణ కొరవడడంతో ఔట్ సోర్సింగ్ సిబ్బంది బిల్ కలెక్టర్ల అవతారమెత్తి అందిన కాడికి దోచుకున్నారన్నా ఆరోపణలు ఉన్నాయి. ఒకరిద్దరు బిల్ కలెక్టర్లు ప్రభుత్వ ఉద్యోగుల పేరున బిల్లింగ్ యంత్రాలను తీసుకొని ప్రజల నుంచి పలు రకాల పన్నులు వసూలు చేశారని తెలిసింది. ఇప్పుడా బిల్ కలెక్టర్లు ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులను ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా సొంతానికి వాడుకొని దుర్వినియోగంకు పాల్పడ్డారన్నా ఆరోపణలు ఉన్నాయి. 15వరకు వాడుకున్న పన్నులను జమ చేయని సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి చేసిన ఆదేశాలను మున్సిపల్ అధికారులు ఖాతరు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దుర్వినియోగమైన మున్సిపల్ పన్నుల రికవరీపై జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, తాము చెల్లించిన పన్నులను ఆన్‌లైన్ అప్‌డేట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

## సాహిత్యంతో సమాజ హితం

**కవిరాజ్ సమ్మేళనంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు**



కవిరాజ్ స్మారక సంచికను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

సూర్యాపేట టౌన్, మే 25 : సమాజ హితం, సమకాలిన పరిస్థితులకు సాహిత్యం అద్దం పడుతుందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. సూర్యాపేటలోని బాలాజీగ్రాండ్‌లో ఆదివారం సుధాబ్యాంకు ఎండీ, మనమ్ వికాస్ వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 57వ వార్షిక కవి సమ్మేళనం కవిరాజ్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మనిషి భావోద్వేగమే కవిత్వమని, కవిత్వం రెండు రకాలుగా ఉంటుందని ఒకటి ప్రేమతో మరొకటి విప్లవంతో అని తెలిపారు. ప్రతి కవి తన భావాలను, హృదయ స్పందనను కవితలు, కవిత్వం రూపంలో వ్యక్త పరుస్తారని చెప్పారు. చాలా మంది కవిత్వం బాగా రాస్తారని, కానీ చదువలేరని, రాయడం చదవడం వచ్చిన వారే గొప్ప కవులుగా రాణిస్తారని తెలిపారు. సూర్యాపేటలో కవిరాజ్ అంటే కవిత్వానికి ఓ గుర్తింపు అని, ఆయనను స్మరించుకోవడం అంటే సమాజంలో వచ్చే అవ లక్షణాలను నివారించుకోవడమేనని చెప్పారు. అనంతరం పలువురు కవులు తమ కవితాగానం చేయగా, కవిరాజ్ స్మారక సంచికను ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా మహదేవ్ ఆవిష్కరించారు. కవి, రచయిత, చరిత్ర పరిశోధకుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డికి కవిరాజ్ సాహితీ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.రాందాస్, గుడిపాటి, వై.గోపిరెడ్డి, కక్కిరేణి చంద్రశేఖర్, బోనగిరి భాస్కర్, డీఎస్వీ శర్మ, యాసిన్, పోరండ్ల రంగయ్య, సాగర్ల సత్తయ్య, కృష్ణ కౌండిన్య, తూల శ్రీనివాస్, వేముల వెంకటేశ్వర్లు, గంజి దుర్గాప్రసాద్, సిలివేరు లింగమూర్తి, గెల్లి అంజన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

# ఎత్తివేత దిశగా ఎస్సీ స్టడీ సర్కిళ్లు!

**అధికారంలోకి వచ్చాక ఒక్క బ్యాచ్ కూడా నడుపని కాంగ్రెస్ సర్కారు**




- రాష్ట్ర వ్యాప్తంగా మూత పడ్డ 11 ఎస్సీ స్టడీ సర్కిళ్లు
- ఎస్సీ వెల్ఫేర్ సీఎం దగ్గర ఉండటంతో ధైర్యం చేయని అధికార యంత్రాంగం
- గత ప్రభుత్వంలో నిర్వహించిన బ్యాచ్‌లకు సైతం డబ్బులివ్వని రేవంత్
- కలెక్టర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న బిల్డింగ్ ఓనర్స్, మెస్ కాంట్రాక్టర్లు
- బ్యాచ్‌లు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలంటున్న నిరుపేద అభ్యర్థులు

నల్లగొండ, మే 25 : పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి దానికి స్పెషల్ ఫండ్ కేటాయించి ఉచితంగా శిక్షణ ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఉన్న కోచింగ్ సెంటర్లకే నిధులివ్వకుండా ఎత్తివేసే దిశగా అడుగులు వేస్తున్నది. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ఏడాదిన్న కింద అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ ఉద్యోగార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చే ఎస్సీ వెల్ఫేర్ శాఖను తన వద్దనే పెట్టుకోవటంతో దళిత అభ్యర్థులు ఉచిత శిక్షణకు దూరం అవుతున్నారు. ఫలితంగా వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే జాబ్ నోటిఫికేషన్లకు ప్రిపరేషన్ కావడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఏడాదికి రెండు బ్యాచ్‌ల చొప్పున పది నెలలపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 11స్టడీ సర్కిళ్లలో 2,200 మందికి ఫౌండేషన్ కోర్సు పేరుతో ఉచిత శిక్షణ, వసతి కల్పించారు. కానీ కాంగ్రెస్ సర్కారు ఏడాదిన్న కాలంగా ఒక్క బ్యాచ్ కూడా నిర్వహించకపోవడం, గత సర్కార్ హయాంలో నిర్వహించిన బ్యాచ్‌లకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోవడంతో ఆయా జిల్లాల సంబంధిత శాఖల అధికారులు, కలెక్టర్ల చుట్టూ బాధితులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

### ఎస్సీ వెల్ఫేర్‌ను పట్టించుకోని సీఎం రేవంత్

సాధారణంగా ప్రతియేటా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆయా శాఖల్లో జాబ్ నోటిఫికేషన్స్ పడుతున్న నేపథ్యంలో నిరుద్యోగులు ఆయా ఉద్యోగాలకు ప్రిపరేషన్‌లో భాగంగా శిక్షణ తీసుకుంటారు. పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో ప్రభుత్వం ఆయా వర్గాల వారీగా సంబంధిత స్టడీ సర్కిళ్లల్లో ఉచితంగా శిక్షణ ఇస్తుంది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 11 బీసీ, 11 ఎస్సీ, ఒక మైనార్టీ, ఒక ఎస్టీ స్టడీ సర్కిళ్లల్లో శిక్షణ ఇస్తుంది. గత బీఆర్‌ఎస్ సర్కార్ ఏటా ఆయా స్టడీ సర్కిళ్లలో ఈ ఉచిత శిక్షణ ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ, మైనార్టీ, ఎస్టీ స్టడీ సర్కిళ్లు నడుస్తున్నప్పటికీ ఎస్సీ స్టడీ సర్కిళ్లను మాత్రం పట్టించుకోవడం లేదు. సీఎం రేవంత్ తన వద్ద ఎస్సీ వెల్ఫేర్ శాఖ ఉంచుకోవడం, నిధులు ఇవ్వకపోవడంతో ఆయా సర్కిళ్లు ఉత్సవ విగ్రహాల్లా మారి మూసివేత దిశగా అడుగులు పడుతున్నాయి.

### గతంలో ఏటా 2,200 మందికి ఉచిత వసతితో శిక్షణ

రాష్ట్రంలో నల్లగొండ, ఆదిలాబాద్, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో ఎస్సీ స్టడీ సర్కిళ్లు ఉన్నాయి. వాటిల్లో ఫౌండేషన్ కోర్సు పేరుతో ప్రతియేటా రెండు బ్యాచ్‌లు (ఒక బ్యాచ్ ఐదు నెలలు)ప్రభుత్వం నిర్వహిస్తుంది. భవనం అద్దె, ఫ్యాకల్టీ, మెస్, ఉద్యోగులు, ఇతర నిర్వహణ ఖర్చులకు ప్రతి అభ్యర్థికి బ్యాచ్‌కు సుమారు రూ.2,400 చెల్లిస్తుంది. ఈ భారాన్ని తప్పించుకోవడానికి సీఎం రేవంత్ ఈ స్టడీ సర్కిళ్లను పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. గత సర్కార్ హయాంలో నిర్వహించిన బ్యాచ్‌లకు డబ్బులు కూడా ఇప్పటి వరకు విడుదల చేయకపోవడంతో అద్దెల కోసం బిల్డింగ్ ఓనర్స్, మెస్ బిల్స్ కోసం కాంట్రాక్టర్స్, జీతాల కోసం ఉద్యోగులు, ఫ్యాకల్టీ, సంబంధిత శాఖ ఉద్యోగులు, కలెక్టర్ల చుట్టూ తిరుగుతూ లెటర్లు పెడుతున్నారు. సీఎం దగ్గరకు వెళ్లి అడిగే ధైర్యం సంబంధిత అధికారులకు లేకనే బిల్లులు రావడం లేదని బిల్డింగ్స్ ఓనర్స్, మెస్ కాంట్రాక్టర్స్ అంటున్నారు.

## సజావుగా డీఈఈ సెట్

రామగిరి, మే 25 : డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎల్‌ఈడీ), డిప్లొమో ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్‌ఈ) కోర్సులో ప్రవేశానికి నిర్వహించే డీఈఈ సెట్–2025 ఆదివారం సజావుగా జరిగింది. నల్లగొండ ఎస్పీఆర్ పాఠశాల ఆవరణలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో రెండు విడుతల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్షలు జరిగాయి. ఉదయం 81 మంది విద్యార్థులకు 77 మంది, మధ్యాహ్నం 185మందికి 155మంది హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నీలంరెడ్డి తెలిపారు. పరీక్షలను నల్లగొండ డైట్ ప్రిన్సిపాల్ కె.నర్సింహ పర్యవేక్షించారు. గతేడాది కంటే ఈ సంవత్సరం అభ్యర్థుల సంఖ్య పెరిగిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.